# అతనిలో వెలుగు చుక్క

సాయంత్రం ఆరున్నర గంటలు దాటింది. ఆకాశంలో సంధ్యారుణిమ అందంగా అల్లుకొంది. రత్తమ్మ తన రెండవకొడుకును వెంటబెట్టుకుని అమ్మవారిగుడికి బయలుదేరింది. పదిహేను రోజుల కొకసారైనా ఉత్తరం వ్రాసే పెనిమిటినుంచి యించుమించు నెలరోజులైంది జాబులేదు. పూనానుంచివ్రాస్తూ తన కొత్తఅడ్రసు కేరాఫ్ 56 ఎ.పి ఒ. అని వ్రాశాడు అంటే అక్కడినుండి బయలుదేరినట్లు అర్థమైంది. చైనావాళ్ళతో యుద్ధం జరుగుతుందని ఏనోటవిన్నా అదేమాట. సందేహంలేదు. సిద్దప్పనుకూడా అక్కడికే పంపించివుంటారు. తర్వాత ఏంజరిగిందీ, పెనిమిటి ఎక్కడ వున్నదీ రత్తమ్మకుతెలియలేదు. సిద్దప్పనుగురించి రత్తమ్మ అనేకవిధాల బెంగ పెట్టుకుంది.

నాలుగునెలలక్రితం సెలవులోవచ్చాడు సిద్దప్ప. వెళ్లిపోయేటప్పుడు మొగలిపువ్వ తలలోపెట్టుకుని, చారెడు కుంకంబొట్టుతో కలకలలాడుతున్న రత్తమ్మనుచూసి తనివితీర మూర్ధంనిమిరి అనందించాడు.

పసుపు కుంకం, అరటిపళ్ళు సమర్పించింది అమ్మవారికి. తన పసుపు కుంకం నిలబెట్టమని వేడి కన్నీరు కార్చింది. భర్తజాడ త్వరలో తెలియజేయమని వేడుకుంది. కష్టాలలోవున్న మనిషికి మానవాతీత శక్తి అయిన దేవి దయచూపకపోతే యింక సానుభూతి సుఖం ఎలాలభిస్తుంది.

రత్తమ్మ లోలోపల గొల్లుమంది. చిన్నకొడుకు తన కన్నీరు చూడకుండా చప్పున కళ్ళుఒత్తుకుని తుడుచుకుంది.

ఇంటికిరాగానే ప్రక్కింటి రంగయ్యతాత రేడియోవార్తలు వినిపించాడు రత్తమ్మకు. హిమాలయ సరిహద్దున చైనా దొంగచాటున దాడి చేసింది. యుద్ధం చాలా ఘోరంగా జరుగుతున్నదట. మనవాళ్ళు చాలా మంది ధైర్యంగా పోరాడుతున్నారట– అన్నాడు రంగయ్య.

పెద్దకొడుకు యింటికివచ్చాడు రాత్రి ఏడుగంటలకు—రెండుమైళ్ళ దూరానఉన్న హైస్కూలుకు నడిచివెళ్ళివచ్చి, శ్రద్ధగా చదువుకుంటూ, తెలివైనవాడని పేరు సంపాదించుకున్నాడు. పెద్ద కొడుకును చూస్తోంటే పూర్తిగా సిద్దప్ప పోలికలు కలిపించాయి రత్తమ్మకు.

"నాన్నదగ్గరనుంచి ఉత్తరంఏదైనా వచ్చిందా?" అన్నాడు పెద్ద కొడుకు దాసన్న.

జ్ఞానంవచ్చిన పెద్దకొడుక్కుకూడా తండ్రిధ్యాసే. తనబాధ గట్టిగా పైకిచెబితే కుర్రవాళ్ళు మరీ బెంగపెట్టుకుంటారని తన దుఃఖం దిగమ్రింగి ధైర్యంగా మాట్లాడింది రత్తమ్మ.

'వస్తుందిలే! కంగారెందుకు?'

రాత్రి చీకటిఅంతా తన జీవితంలో చీకటిలా కనిపించింది రత్తమ్మకు. కడుపులో మరొకపాప! దాని అదృష్టం ఎలావుందో! తండ్రిని కళ్ళ చూడగలదోలేదో! రత్తమ్మకు ఎడం కన్ను అదిరింది. కొంచెం ధైర్యం తెచ్చుకుంది రత్తమ్మ.

ప్రతిరోజూ పోస్టుజవాను వచ్చే సమయంకోసం రత్తమ్మ వేయి కళ్ళతో కాచుకు కూర్చునేది. ఈమధ్య ఉత్తరాలే లేవు ఎవరిదగ్గిరినుంచీ.

అప్పుడప్పుడు అన్న, చెల్లెలు కులాసా అని ఒక కార్డు వ్రాస్తారు. ఆరోజు ఎందుకో ఎడంకన్ను అతిగా కొట్టుకొంటోంది. కాకి అరుస్తోంది...పోస్టు జవాను వచ్చాడు ఉత్తరం అందిచ్చాడు— పైన సిద్దప్ప దస్తూరీ ... రత్తమ్మకు ఆనందభాష్పాలు జలజలారాలాయి. సిద్దప్ప సజీవంగాఉన్నాడు ధైర్యంతో ఆనందంతో ఊగిపోతూ ఉత్తరం చదివింది.

సిద్దప్ప యుద్ధంలో గాయాలుతగిలి ఆస్పత్రిలోచేరాడు. త్వరలో నయమయి యింటికి రాగలనని వ్రాశాడు.

"ఏం గాయాలు?" రత్తమ్మకు అర్థంకాలేదు. ఏవో దెబ్బలుతగిలి ఉంటాయని సముదాయించుకుంది. అయినా తన పసుపుకుంకుమ అమ్మ వారు నిలబెట్టినందుకు ఆనందించింది.

పెద్దకొడుకు దాసన్న ఉత్తరంచదివాడు. మంచుకొండలలో అన్యాయంగా శత్రువు దురాక్రమణచేసి, మిత్రద్రోహియై, అనేకమంది భారత వీరులకు కష్టాలు కల్గించినందుకు ఉగ్రుడైపోయాడు.

రత్తమ్మ హృదయం కొంచెం ఉపశమనంపొందింది. ఆనందంలో ఆనాడు గడిపింది. అప్పుడప్పుడు వారాని కొకసారైనా సిద్దప్పదగ్గరినుంచి ఉత్తరాలు వస్తున్నాయి ఆరోగ్యం బాగున్నట్లు. అలా మూడునెలలు గడిచాయి.

* * * *

ఒకరోజు సాయంత్రం హఠాత్తుగా యింటిముందు జట్కాఆగింది, సిద్దప్పవచ్చాడు. వీధిలో ఆడుకుంటున్న రెండోకొడుకు తండ్రి రాకచూసి గంతేసి లోపలికిపోయి రత్తమ్మకుచెప్పాడు. రత్తమ్మ ఆనందభాష్పాలు ఆపుకోలేక పరుగెత్తుకుంటూ బయటికి జట్కాదగ్గరికి వచ్చేసింది.

సిద్దప్ప కష్టంగా జట్కాదిగుతున్నాడు. ముఖంమీద గాయాల మచ్చలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మెల్లిగా రత్తమ్మ సాయంతో దిగాడు సిద్దప్ప.

సిద్దప్ప నడుస్తోంటే టక్‌టక్_ అని శబ్దం వచ్చింది.

రత్తమ్మ ఆశ్చర్యపోయింది.

ఒక క్షణంఆగి సిద్దప్పను పరిశీలించింది.

సిద్దప్ప ఎడమ మోకాలిక్రింద పాంటు ఊగిసలాడుతోంది. లోపల కఱ్ఱకాలు...

రత్తమ్మ ముఖం వివర్ణమయింది ఒక క్షణం. లోపలికి తీసుకు వెళ్లి సిద్దప్ప కాస్త విశ్రమించాక సంగతిచెప్పాడు.

కాలునిండా గాయాలుతగిలి పుచ్చిపోయిందని, అది నరికితేకాని బ్రతికే ఆశలేకపోవడంతో ఆపరేషను జరిగిందని, యింక మిలిటరీలో తాను ఉపయోగపడకపోవటంచే యింటికి పంపారన్నాడు సిద్దప్ప.

రత్తమ్మకు ఒకవైపునుంచి దుఃఖం, మరోవైపు ఆనందం పెనవేసుకుపోయాయి. ఏమైనా భర్త బ్రతికివచ్చినందుకే సంతోషించింది.

రాత్రి పెద్దకొడుకు దాసన్నవచ్చాడు. తండ్రిలోని మార్పుచూసి నిర్ఘాంతపోయాడు. శత్రువుపై ఉగ్రుడైపోయాడు.

సిద్దప్ప ఆనాటివిషయంచెప్పాడు... ఒకరోజు తెల్లవారుజామున సైనికగుడారాల సరిహద్దులో కాపలాకాస్తూంటే, హఠాత్తుగా శత్రువుల తుపాకులప్రేల్పులు...సిద్దప్ప పెద్దపెట్టున అరిచాడు. తక్కిన సైనికులంతా జాగరూకులై లేచారు. తమ తుపాకులు ప్రయోగించారు. అయితే శత్రువు ఆకస్మికంగా దాడిచేయడంతో తుపాకులకు కొందరు గురిఅయి గాయాలు పొందారు.

ట్రెంచిలోనుండి సిద్దప్ప మరిద్దరు మెషిన్‌గన్‌ను నిర్విరామంగా ప్రేల్చుతూ, శత్రువుల పురోగమనమును రెండుగంటలసేపు నిరోధించారు. ఈదాడి జరిపిన శత్రుబృందం తీవ్రంగా నష్టపడింది. మిగిలినవారు ఉపసంహరించుకున్నారు. తిరిగి పెద్దపెట్టున దాడిజరపడానికి సన్నాహాలు చేసుకొనే ఉద్దేశ్యంతో.

అంతకుముందు ట్రెంచిలో తూటాలు అయిపోయినందున, ప్రధాన గుడారంనుండి మందుగుండు తెస్తున్న సిద్దప్పకాలికి శత్రువుల తూటా తగిలింది. అయినా లక్ష్యంచేయకుండా నేలబారునపాకి తూటాలను ట్రెంచి లోని తన మిత్రులకు అందించాడు సిద్దప్ప. గాయాలు తగిలిన సిద్దప్పను సురక్షిత స్థావరానికి చేర్చారు. అక్కడినుండి ప్రధానస్థావరంలోని ఆసుపత్రికి చేర్చినతర్వాత ఆపరేషన్‌చేసి కాలు తీసివేశారు.

దాసన్న గుండెలు మాడిపోయినంత బాధపడ్డాడు. ప్రతీకారం తీర్చుకోవాలి శత్రువుపైన అనుకున్నాడు. తండ్రి విడిచివచ్చిన సైన్యంలో తన తరం చిహ్నం నిలవాలి.

'నాన్నా ఈ అన్యాయానికి నేను పగతీర్చుకుంటాను. నేను సైన్యంలో చేరుతాను నాన్నా' అన్నాడు దాసన్న.

సిద్దప్ప ఆనందంతో, ఒళ్ళు పులకరంతో ఒక్క నిమిషం మాట రాలేదు. అయినా కొడుకుఅన్నమాటల్లో సత్యంఉంది...తన ప్రతిబింబం-తనకు వారసుడు తన లక్ష్యాలు సాధించాలి... సాధించగలడు కొడుకు. సిద్దప్ప దాసన్నను కౌగలించుకున్నాడు.

"వద్దు పెద్దవాణ్ణి పంపించవద్దు మిలిటరీలోకి!" అంది రత్తమ్మ బాధగా.

'అదికాదు పిచ్చిపిల్లా! నీభర్త వీరుడు...నీకొడుకు భీరువు ఎలా అవుతాడు...అవకూడదు. వెళ్లనీ సైన్యంలోకి.'

సజల నయనాలతో రత్తమ్మను దగ్గరకు తీసుకున్నాడు సిద్దప్ప.

అమ్మవారి గుళ్ళోగంటలు యింటికావలినుంచి ప్రతిధ్వనించాయి. ఆకాశంలో నక్షత్రాలు దూరాన మెరిసాయి.

అనుకున్నాడు సిద్దప్ప... తమలాగే నక్షత్రాలు కొద్ది వెలుగే యివ్వవచ్చు దూరాన్నుంచి— కాని దగ్గరికివస్తే ఎంతపెద్దవో, గొప్పవో తెలుస్తుంది. గర్వంగా నవ్వుకున్నాడు సిద్దప్ప.

* * *